సాక్షి కర్నూలు

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీగిరిలో నిత్య కళావేదికపై కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పలు భక్తిగీతాలకు నృత్యం చేశారు.



వైభవం.. స్వాతి మహోత్సవం

అహోబిల క్షేత్రంలో స్వాతి మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణతో నల్లమల పులకించిపోయింది. 10లో▸



కోడ్ కూసింది.. జాగ్రత్త!

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా ప్రజలు రాష్ట్ర సరిహద్దు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. 10లో▸

న్యూస్‌రీల్

క్వింటా ఉల్లి రూ.2,915

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర ఆశాజనకంగా ఉంది. వర్షాలు పడక దిగుబడులు తగ్గిన నేపథ్యంలో ఉల్లి రైతులను ధరలు ఆదుకుంటోంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 69 మంది రైతులు 2,055 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను మార్కెట్‌కు తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.1,309, గరిష్ట ధర రూ.2,915, మోడల్ ధర రూ.2,369 లభించింది. గత 10 రోజులతో పోలిస్తే ఉల్లి ధర పెరిగింది. మార్కెట్‌లో ఎండుమిర్చికి రూ.15,399, సోయాబీన్‌కు రూ.3,989, మినుములకు రూ.7,570, మొక్కజొన్నకు రూ.1,861, ఆముదాలకు రూ.5,511, పొద్దుతిరుగుడు విత్తనాలకు రూ.4,789, వేరుశనగకు రూ.7,909 ప్రకారం ధర లభించింది.

బస్సు యాత్రపై నేడు సన్నాహక సమావేశం



జూపూడిని కలసిన బీవై రామయ్య, ఎమ్మెల్యేలు సుధాకర్, హాఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): సామాజిక న్యాయ బస్సు యాత్ర జయప్రదం కోసం మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమలోని ఏడు జిల్లాల ఎస్సీ ముఖ్య నాయకులు చేపట్టే బస్సు యాత్ర నేపథ్యంలో మంగళవారం ఉదయం 10గంటలకు స్థానిక దేవనగర్‌లోని ఎంఎస్–9 హోటల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు, ఎంపీ నందిగాం సురేష్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో పాటు ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు ఈ కీలక సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. అయితే సోమవారం రాత్రే కర్నూలుకు చేరుకున్న జూపూడిని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామయ్యతో పాటు ఎమ్మెల్యేలు డాక్టర్ సుధాకర్, హఫీజ్‌ఖాన్, ఇతర పార్టీ నాయకులు ప్రభుత్వ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

పటిష్ట భద్రత మధ్య ఎఫ్‌ఎల్‌సీ




ఈవీఎం గోదాములోకి వెళ్తున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుకు సంబంధించి ఫస్టు లెవల్ చెకింగ్(ఎఫ్‌ఎల్‌సీ)ప్రక్రియ సోమవారం పటిష్ట భద్రత మధ్య ప్రారంభమైంది. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో ఉదయం 7 గంటలకే గుర్తింపు పొందిన ఐదు రాజకీయ పార్టీలప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియను సూపర్‌వైజర్, డీపీఓ నాగరాజునాయుడు ప్రారంభించారు. మధ్యాహ్నం కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈవీఎంలను నవంబర్ 10 వరకు రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలించనున్నట్లు చెప్పారు.

నిష్టతో దీక్ష.. మల్లయ్య రక్ష

- పక్షం రోజులు మద్యం, మాంసం ముట్టని మూడు గ్రామాల ప్రజలు
- దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామిపై భక్తితో ప్రతి ఏటా దీక్ష
- దసరా 'బన్ని' ఉత్సవ నిర్వహణ బాధ్యతను చేపట్టేది ఈ గ్రామ ప్రజలే
- 19న కంకణధారణతో ఉత్సవాలు ప్రారంభం



నెరణికి గ్రామం ఏరియల్ వ్యూ



నెరణికిలో ఉత్సవమూర్తులు

హొళగుంద/ఆలూరు: దసరా సందర్భంగా నిర్వహించే దేవరగట్టు ఉత్సవాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. వేడుకల్లో పాల్గొనే ప్రజలు పరమనిష్టతో స్వామిని కొలుస్తారు. పక్షం రోజుల పాటు మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. ఉత్సవాలు ముగిసే వరకు ఆచారాన్ని తప్పకుండా పాటిస్తారు. హొళగుంద మండలం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు విజయదశమి రోజు 'బన్ని' ఉత్సవ బాధ్యతను తీసుకుంటారు. ప్రతి ఏటా దేవరగట్టులో వేడుకను విజయవంతంగా జరుపుకుంటూ వస్తున్నారు. ఈ ఏడాది ఈ నెల 19 నుంచి దసరా వేడుకలు జరగనున్నాయి. ఈ నెల 24న మాళమల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని, 'బన్ని' వేడుకను జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చెప్పులు తొడగరు

దేవరగట్టు శ్రీ మాళమల్లేశ్వరస్వామి ఉత్సవాల్లో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులదే కీలక భూమిక. అమావాస్య రోజు నుంచి వీరు దీక్షను మొదలు పెట్టి బన్ని ఉత్సవాలు ముగిసేంత వరకు నిష్టతో ఉంటారు. విగ్రహాలు తిరిగి నెరణికి గ్రామానికి చేరే వరకు కట్టుబాట్లను తప్పకుండా పాటిస్తారు. పక్షం రోజుల పాటు చెప్పులు తొడగకుండా, మద్యం సేవించకుండా, మాంసం ముట్టకుండా బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు. దైవకార్యాన్ని విజయవంతంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంటారు. బన్ని వేడుకలో అన్నదమ్ముల్లా కలిసి ఉంటామని పాలబాస తీసుకుంటారు.

దేవరగట్టులో దసరా ఉత్సవ వివరాలు..

- ➤ 19న గురువారం నెరణికి గ్రామంలోని మాళమల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను దేవరగట్టుకు తీసుకెళ్లి రాత్రి కంకణధారణ నిర్వహిస్తారు.
- ➤ 24 మంగళవారం రాత్రి కళ్యాణోత్సవం నిర్వహిస్తారు.అనంతరం జైత్రయాత్ర మొదలై రక్షపడి మీదుగా శమీ వృక్షం చేరుతుంది.
- ➤ 25న బుధవారం ఉదయం నెరణికి గ్రామ ఆలయ పూజారి భవిష్యవాణి(కార్ణీకము) వినిపిస్తారు.
- ➤ 26న గురువారం నెరణికి గ్రామ పురోహితుల చేత స్వామి వారికి పంచామృతం, బండార్చనం, రథ సంస్కారం, రథాంగహోమ పూజులు నిర్వహించి సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు.
- ➤ 27న శుక్రవారం గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవం, సాయంత్రం వసంతోత్సవం, కంకణ విసర్జన ఉంటాయి.
- ➤ 28న శనివారం మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

మనస్సు నిండా భక్తిభావం

విజయదశమి నాడు అందరికీ దసరా పండుగా అయితే ఆ మూడు గ్రామస్తులకు మాత్రం ఉండదు. బన్ని ఉత్సవాలు ముగిసి విగ్రహాలు నెరణకి గ్రామానికి చేరే రోజు విజయానికి సూచికగా వారు పండుగ చేసుకుంటారు. మరుసటి రోజు కరి పండుగను జరుపుకుంటారు. ఈ కట్టుబాట్లను కులమత భేదాలు లేకుండా అన్ని వర్గాల వారు పాటిస్తారు. ఉత్సవాలు ముగిసేంత వరకు ఒకరినొకరు కొట్టుకోరు. ఒకరినొకరు తిట్టుకోరు. మనస్సు నిండా భక్తి భావాన్ని నింపుకుని నిష్టతో, నిబద్ధతతో ఉంటారు. కట్టుబాట్లను పాటిస్తున్నందునే బన్ని(కర్రల సమరం) ఉత్సవం విజయవంతంగా ముగుస్తోందని ప్రజలు తెలిపారు. ఒక ప్రణాళికతో, క్రమపద్ధతిలో ఉత్సవాలను జరిపి విజయోత్సవాన్ని జరుపుకోవడంలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెల్లుతుంది. అయ్యప్ప, శివమాలలాగ కొందరు యువకులు రెండేళ్లుగా మల్లయ్య మాల దీక్షను తీసుకుంటున్నారు. ఉత్సవమూర్తులు నెరణికి గ్రామానికి చేరిన తర్వాత దీక్షను విరమిస్తున్నారు.

విగ్రహాల రక్షణే మా లక్ష్యం



వేలాది మంది పాల్గొనే వేడుకల్లో జాగ్రత్తగా విగ్రహాలను కాపాడుకోవడమే మా మూడు గ్రామాల లక్ష్యం. కఠోర కట్టుబాట్లతో ఉండంతోనే జైత్రయాత్రలో విగ్రహాలకు దెబ్బలు తగలకుండా రక్షణ కవచగా ఉండి కాపాడుకుంటూ వస్తున్నాం. విగ్రహాలను కైవసం చేసుకోవడానికి అడ్డు పడ్తారనేది అవాస్తవం. విగ్రహాలను కర్రలతో తాకి మొక్కు తీర్చుకోవడానికి భక్తులు ముందుకు వస్తారు. ఈ క్రమంలో కర్రలు ఒకదానికొకటి తగిలి శబ్దం వస్తాయి. అయితే చూసే వారికి కర్రలతో కొట్టుకుంటున్నట్లు కనబడుతుంది. కట్టుబాట్లను అనాదిగా పాటిస్తూ వస్తున్నాం. మద్యం, మాంసం ముడితే బన్ని ఉత్సవం జరిపే అర్హత కోల్పోతాం.

– బసవరాజు, గొరవయ్య, నెరణికి

కట్టుబాట్లను పాటిస్తారు



దేవరగట్టు ఉత్సవాల్లో మూడు గ్రామస్తులు నిష్టతో కట్టుబాట్లు పాటిస్తారు. బన్ని ఉత్సవం రోజు రెండుసార్లు స్నానం చేస్తారు. సాయంత్రం గట్టుక్లే ముందు ప్రతి ఒక్కరూ స్నానమాచరించి గుడికి వెళ్లి టెంకాయ కొట్టి వస్తారు. అనంతరం తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని కొండకు బయలుదేరుతారు. బన్ని ఉత్సవంలో ఏ ఒక్కరూ మద్యం తాగరు. మాంసం ముట్టరు.

– రవిశాస్త్రి, పురోహితుడు, నెరణికి

కర్రల సమరం కాదది.. మొగలాయి



దేవరగట్టు బన్ని ఉత్సవంలో భక్తులు కర్రలతో కొట్టుకుంటారనేది అవాస్తవం. ఉత్సవాన్ని కర్రల సమరంగా చెప్పడం భావ్యం కాదు. పూర్వం గట్టు మీదకెక్కడానికి దివిటీలు, జంతువుల నుంచి రక్షణగా కర్రలు, ఆయుధాలు తీసుకెళ్లేవారు. కాలక్రమేణా అవి దురుద్దేశాలకు వాడడంతో కర్రల సమరంగా ముద్ర పడింది. మద్యం సేవించిన వారు మాత్రమే గాయ పడుతారు తప్ప ఇతరులకు గాయాల కావు. విచక్షణ కోల్పోయి కొట్టుకోవడం వల్ల గతంలో చనిపోయారు. ఇప్పుడు అలాంటి సంఘటనలు లేవు. ఇదొక సంప్రదాయ పండుగ తప్ప. దీనిని మొగలాయి అంటారు.

– సోమప్ప, నెరణికి గ్రామపెద్ద

ఆచారాలను గౌరవిస్తాం.. రక్తపాతాన్ని ఒప్పుకోం

- దేవరగట్టు సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ సృజన



కాళ్లకు చెప్పులు లేకుండా దేవరగట్టుకు వెళ్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాల్లో ఆచారాలను గౌరవిస్తామని, వేడుకల్లో రక్తపాతాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన స్పష్టం చేశారు. ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి సోమవారం ఆమె దేవరగట్టులో కొండ కింద ఉన్న దేవుళ్లను దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏ దేవుడూ, ఏ మతమూ రక్తపాతాన్ని కోరుకోదని, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పాటిస్తూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పూర్వం స్వామి వారి కల్యాణం జరిపేందుకు గట్టుకు వచ్చే భక్తులు జంతువులు, విష పురుగుల బారి నుంచి రక్షణ పొందేందుకు కర్రలు, మరణాయుధలు తెచ్చే వారని, నేడు వాటిని ఇతరులను గాయపరచడానికి వాడడం సరి కాదన్నారు. సంప్రదాయాలు హింసను కోరుకోవని, చట్టాలను గౌరవిస్తూ వేడుక జరుపుకోవాలన్నారు. ఈ నెల 24న మాళమల్లేశ్వరస్వామి కల్యాణం, బన్ని ఉత్సవాలను తిలకించేందుకు దాదాపు 1.50 లక్షల మంది భక్తులు వస్తారని, వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు.

100 సీసీ కెమెరాలతో నిఘా

ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. ఆచారాన్ని గౌరవిస్తామని, హింసను మాత్రం సహించేది లేదన్నారు. అల్లర్లకు పాల్పడే వారితో పాటు అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే వారిని గుర్తించడానికి కమాండెంట్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. బన్ని ఉత్సవాల్లో డ్రోన్స్, బాడీఓన్, వంద సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా ఉంటుందన్నారు. సివిల్, ప్రత్యేక పోలీస్ బలగాలతో గట్టి బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్షతగాత్రులకు వైద్య సేవలందించడానికి హెల్త్ క్యాంప్, ఐదు అంబులెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, దేవరగట్టు ఆలయ కమిటీ సభ్యులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



సీఎం జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు భద్రత కల్పించడంతో పాటు వారు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అమ్మ ఒడి, పావలా వడ్డీ, చేయూత, చేదోడు వంటి అనేక పథకాలు మహిళల పేరునే మంజూరు చేస్తున్నారన్నారు. మహిళల భద్రతకు దిశ చట్టాన్ని తేవడంతో పాటు దిశ యాప్, దిశ వన్ స్టాప్ సెంటర్ వంటి చర్యలు చేపట్టినట్లు చేప్పారు. ప్రజలకు మేలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేని తెలుగుదేశం పార్టీ నాయకులు విష ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ అధినేత చంద్రబాబు కోట్ల రూపాయాల అక్రమాలకు పాల్పడ్డారని, అన్ని అధారాలు ఉండటంతోనే సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. చంద్రబాబు అరెస్టుతో ప్రభుత్వానికి, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ విజయ మనోహరి, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, పద్మలతా రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు వేగవంతం



సభావేదికకు టెంట్ వేసిన దృశ్యం



హెలిపాడ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లు ఎమ్మిగనూరు పట్టణంలో ముమ్మరంగా సాగుతున్నాయి. జగనన్న చేదోడు పథకం కింద లబ్ధిదారులకు నాలుగో విడత నిధులు విడుదల చేసేందుకు ఈనెల 19న ముఖ్యమంత్రి ఎమ్మిగనూరుకు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో సభావేదిక కోసం టెంట్‌లు వేయించారు. బ్యారికేడ్లు నిర్మించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. వెంకటాపురం వద్ద హెలిపాడ్ నిర్మాణ పనులను ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, పోలీసు అధికారులు పరిశీలించారు. హెలిపాడ్ నుంచి సభాస్థలికి వచ్చే మార్గంలో రోడ్డు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. అదే విధంగా రోడ్డు ప్యాచ్ వర్కులను పూర్తి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.

లోపాలు ఉండకూడదు

కర్నూలు(సెంట్రల్): సీఎం పర్యటన ఏర్పాట్లలో లోపాలు ఉండకూడదని అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. సభా ప్రాంగణానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతికి సూచించారు. అత్యవసరం వైద్యం, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, స్నాక్స్, భోజన వసతులు ఏర్పాటు చేయాలని పౌర సరఫరాలు, డీఆర్‌డీఏ శాఖలకు, అగ్నిమాపక వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మచారిణీ.. నమోస్తుతే!



స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రదక్షిణ దృశ్యం, (ఇన్‌సెట్‌లో) బ్రహ్మచారిణి అలంకారంలో భ్రమరాంబదేవి

- శ్రీశైలంలో దేదీప్యమానంగా సాగుతున్న దేవీ శరన్నవరాత్రులు
- మయూర వాహనంపై ఆదిదంపతుల విహారం
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పులకించిన భక్తజనం

శ్రీశైలంలో నేడు..

దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం శ్రీశైల క్షేత్రంలో చంద్రఘంట అలంకారంలో భ్రమరాంబా దేవి దర్శనమివ్వనున్నారు. అలాగే రావణ వాహనంపై స్వామిఅమ్మవార్లు విహరించనున్నారు.

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలక్షేత్రంలో దేవీ శరన్నవరాత్రులు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు సోమవారం శ్రీశైల భ్రామరీ బ్రహ్మచారిణి రూపంలో దర్శనమివ్వగా, ఆది దంపతులు మయూర వాహనంపై విహరించారు. భక్తజనం స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పులకించిపోయారు. శ్రీశైల భ్రమరాంబాదేవిని బ్రహ్మచారిణి స్వరూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను చేశారు. అమ్మవారి స్వరూపాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

మయూర వాహనంపై మల్లన్న దంపతులు

భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవారలు మయూర వాహనంపై విహరించి భక్తులకు ఆశీస్సులు అందించారు. బ్రహ్మచారిణి స్వరూపంలోని అమ్మవారిని, మయూర వాహనంపై అధిష్టించిన స్వామిఅమ్మవార్లను ఆలయ రాజగోపురం మీదుగా వెలుపలకి తొడ్కొనివచ్చి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



ఆదోని: ప్రత్యేక అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ

కర్నూలు జిల్లాలో..

కర్నూలు నగరం, ఎమ్మిగనూరు, ఆదోనిపట్టణాల్లో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగాయి. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వద్దు

- కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్
- దిశా సమావేశంలో పలు కీలక అంశాలపై సమీక్ష



దిశా సమావేశంలో పాల్గొన్న జేసీ నారపురెడ్డి మౌర్య, జెడ్పీ చైర్మన్, ఎంపీ, మేయర్, ఎమ్మెల్యేలు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో దిశ సమావేశం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జె.సుధాకర్, నగర మేయర్ బీవై రామయ్య హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ కర్నూలు మండలంలోని ఆల్కాలీస్ ఫ్యాక్టరీ వల్ల భవిష్యత్తులో సమీప గ్రామాల ప్రజలు క్యాన్సర్, కిడ్నీ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమీప గ్రామాల్లో సాయిల్ హెల్త్ కార్డు, గ్రౌండ్ వాటర్‌ను వెంటనే పరీక్షించి రిపోర్టు రూపొందిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందజేస్తానన్నారు. స్కానింగ్ సెంటర్లలో అనధికారికంగా లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు జరుగుతున్నాయని, ఆకస్మిక తనిఖీలు చేసి నిర్వాహకులను జైలుకు పంపాలన్నారు.

జిల్లాపరిషత్ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ..

అనంతపురం నుంచి అమరావతి వరకు మంజూరైన జాతీయ రహదారి మధ్యలో బుగ్గ నుంచి గిద్దలూరు వరకు రోడ్డు చాలా అధ్వానంగా తయారైందన్నారు. కనీసం ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని కోరారు. కర్నూలు – నందికొట్కూరు రోడ్డు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు.

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ..

జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్య శ్రీ రోగుల నుంచి కూడా డబ్బులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితి మారాలన్నారు. డీఎంఎఫ్ నిధుల వినియోగంలో ఎమ్మెల్యేగా తనకు కనీస సమాచారం ఇవ్వరా? అని ప్రశ్నించారు. జిల్లాలో జాతీయ రహదారుల నిర్వహణ చాలా అధ్వాన్నంగా తయారైందన్నారు.

➡ కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ మాట్లాడుతూ కోడుమూరులోని మార్కెట్ యార్డుకు కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతుందని, వెంటనే హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారి విస్తరణలో దేవాలయాలు, చర్చి, మసీదులు కూల్చేసే ఎన్‌హెచ్ అధికారులకు స్థానిక స్టాంటన్‌పురం సమీపంలోని జాతీయ రహదారి స్థలంలో షాపులు నిర్మించినా, కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

➡ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మహిళా సంక్షేమ అధికారులు బాల్య వివాహాలపై అవగాహన కల్పించేలా విస్తృతంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా దిశా కమిటీ సభ్యులు లేవనెత్తిన అంశాలను పూర్తిస్థాయిలో మరుసటి సమావేశం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దిశా కమిటీ సభ్యులు రమేష్, ఇల్లూరి నరసింహ, కృష్ణారెడ్డి, రాజు, సుంకన్న, వాణి, పుష్పలత పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చారు. సమావేశంలో జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీఎల్‌పీఓ తిమ్మక్క, పంచాయతీరాజ్ ఈఈ మద్దన్న, డీఈఈ మహేశ్వరరెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆడుకుంటూ అనంతలోకాలకు..

● నీటి టబ్బులో పడి బాలుడి మృతి


హర్షవర్ధన్ (ఫైల్)

ఆదోని అర్బన్: ఆడుకుంటూ ఓ బాలుడు నీటి టబ్బులో పడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఆదోని పట్టణం రాజీవ్‌గాంధీనగర్ చోటుచేసుకుంది. బూసప్ప కుమారుడు హర్షవర్ధన్ (11నెలల చిన్నారి) మధ్యాహ్నం ఆడుకుంటూ ఇంట్లో ఉన్న నీటి టబ్బులో పడి పోయాడు. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గమనించారు. వెంటనే పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు అకస్మాత్తుగా మృతిచెందడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగి పోయింది.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షునిగా కృష్ణారెడ్డి

కర్నూలు సిటీ: పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షునిగా ఎస్.వి కృష్ణారెడ్డిని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మిట్టా క్రిష్ణయ్య, వి.కరుణానిధిమూర్తిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా అధ్యక్షునిగా పని చేస్తున్న కృష్ణారెడ్డి ఇటీవల కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కర్నూలు జిల్లా తాత్కాలిక అధ్యక్షునిగా ఉన్న ఎస్.ఎం.డి.బాషా స్థానంలో కృష్ణారెడ్డికి పూర్తి స్థాయి అధ్యక్ష బాధ్యతలు అప్పగించామన్నారు. ఎస్.ఎం.డి.బాషాను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నియమించినట్లు పేర్కొన్నారు.

'స్పందన' అర్జీలు రీఓపెన్ కాకూడదు


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీల రీ ఓపెన్ కాకుండా సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం నిర్వహించారు. జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదనరావు, ఎస్‌డీసీలు రమ, నాగప్రసన్నలక్ష్మీ, సీపీఓ ఎల్ అప్పలకొండ.. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అసంతృప్తి వ్యక్తం చేసిన అర్జీదారుల వివరాలపై ఆడిట్ నిర్వహించి ప్రతి శనివారం కలెక్టర్‌కు నివేదిక సమర్పించాలన్నారు.

అర్జీల్లో కొన్ని...

- తన 3.38 ఎకరాల భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కృష్ణగిరి మండలం ఆల్వకొండకు చెందిన అయ్యమ్మ కోరారు.
- తన పొలంలో పత్తి పంటను నాశనం చేశారని, వారిపై చర్యలు తీసుకుని, పరిహారం చెల్లించాలని ప్యాలకుర్తికి చెందిన నాగేష్ కోరారు.
- పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని కర్నూలు మండలం జోహరపురానికి చెందిన దూదేకుల మక్బుల్ బాషా విన్నవించారు.
- తన భూమి వివరాలు ఆన్‌లైన్‌లో ఇతరుల పేరిట నమోదయ్యాయని, సరి చేయాలని కృష్ణగిరి మండలం పి.కోటకొండకు చెందిన ముక్కెర రామక్క కోరారు.

కోడ్ కూసింది.. తస్మాత్ జాగ్రత్త

- తెలంగాణలో అమలులోకి ఎన్నికల కోడ్
- సరిహద్దుల వెంబడి చెక్‌పోస్టుల ఏర్పాటు
- వాహనాలను జల్లెడ పడుతున్న పోలీసులు
- రూ.50 వేలకు మించి నగదుంటే రసీదు తప్పనిసరి


కర్నూలు – తెలంగాణ సరిహద్దు గ్రామాల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది


హైదరాబాద్ – శ్రీశైలం రోడ్డులో మన్ననూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

సాక్షి, నంద్యాల: ఏపీ బార్డర్ దాటుతున్నారా... తెలంగాణలో అడుగు పెడుతున్నారా..? వ్యాపారం, విద్య, ఆరోగ్యం అవసరా నిమిత్తం భారీగా నగదు వెంట తీసుకెళ్తున్నారా? అయితే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోండి. మీ వెంట రూ.50 వేలకు మించి నగదు, గిఫ్ట్ బాక్సులు ఉంటే ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్లే. మీరు తీసుకెళ్లే డబ్బులు సొంతమైనా అవి ఎక్కడి నుంచి వచ్చాయో స్పష్టంగా తెలిపేలా రసీదులు ఉండాల్సిందే. లేదంటే పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి కదలికను, వాహనాలను జల్లెడ పడుతున్నారు. సరిహద్దుల వెంట చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఐదారుగురు పోలీసు సిబ్బంది 24 గంటలూ పహారా కాస్తున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతే వదిలేస్తున్నారు. ఏమాత్రం అనుమానాస్పదంగా డబ్బులు, ఏమైనా వస్తువులు (గిఫ్టులు) ఉంటే సీజ్ చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వెంబడి ఎక్కువ భాగం ఉంది. జిల్లా వాసులే కాకుండా అనంతపురం, కడప, తిరుపతి, చిత్తూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వారు కర్నూలు మీదుగానే వెళ్లాల్సిందే. దీంతో నిబంధనలు తెలియక చాలామంది ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, నాగర్ కర్నూలు జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఎన్నికల సమయంలో నగదు, మద్యం, వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు నాలుగు సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కర్నూలు మీదుగా తెలంగాణాలోకి వెళ్లేముందు పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో, అలాగే శ్రీశైలం – హైదరాబాద్ రోడ్డులో నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ వద్ద మరో చెక్ పోస్టు ఉంది. అలాగే కర్ణాటక మీదుగా తెలంగాణ వెళ్లే వాహనాలను తనిఖీ చేసేందుకు జోగులాంబ గద్వాల జిల్లా కేతిదొడ్డి మండలం నందిన్నే వద్ద ఒకటి, గట్టు మండలం బల్గేరా వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. అలాగే ఉమ్మడి కర్నూలు జిల్లా సరిహద్దు గ్రామాల్లోని రహదారుల వెంబడి తెలంగాణ పోలీసులు విస్తృత వాహనాల తనిఖీలు చేపడుతున్నారు.

ఆధారాలు ఉంటేనే తిరిగి ఇచ్చేస్తారు..

దసరా పండగతో పాటు పెళ్లి ముహూర్తాలు కూడా పెద్ద ఎత్తున ఉన్నాయి. రూ. 50 వేలకు పైగా నగదు వెంట తీసుకెళ్లే వారు రసీదులు, డబ్బులకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా దగ్గర పెట్టుకోవాలి. లేకపోతే నగదు సీజ్ చేస్తారు. సీజ్ చేసిన డబ్బులను తిరిగిపొందాలంటే అందుకు సంబంధించిన పత్రాలన్నీ తీసుకెళ్లాల్సి ఉంటుంది.

వ్యాపారులూ జాగ్రత్త....

వ్యాపార లావాదేవీ నిమిత్తం నగదు రవాణా చేస్తే వాటికి సంబంధించిన రసీదులు కచ్చితంగా వెంట ఉంచుకోవాలి. చట్టబద్ధంగా పన్నులు సక్రమంగా కడుతున్నారని నిర్ధారించుకున్న తర్వాతే వదిలేస్తారు. అలాగే రియల్ ఎస్టేట్ చేసే వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. అలాగే వివాహాలు, వైద్యం, విద్య తదితర అవసరాల కోసం డబ్బులు తీసుకెళుతుంటే అందుకు సంబంధించి పత్రాలు ఉంచుకోవాలి.

➤ కోవెలకుంట్లకు చెందిన వెంకటేష్ తన కుటుంబంతో హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. దసరా పండుగకు సెలవులు ఇవ్వడంతో ఇద్దరు పిల్లలు, భార్యతో కారులో సొంత ఊరికి బయలుదేరాడు. ఇక్కడ వారిని వదిలేసి ఆదివారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. కర్నూలు సరిహద్దు దాటగానే తెలంగాణ పోలీసులు ఆపి, వాహనాన్ని మొత్తం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతని వద్ద రూ.25 వేలకు మించి నగదు లేకపోవడంతో వదిలేశారు.

➤ శ్రీశైలంకు చెందిన వెంకట్ రెడ్డి హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నివశిస్తున్నారు. సొంత పని మీద శ్రీశైలం వచ్చి తిరిగి వెళ్తుండగా నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. అతని వద్ద సుమారు రూ.85 వేల నగదు ఉండడంతో డబ్బుల్ని సీజ్ చేశారు.

సింహవానంపై బ్రహ్మచారిణీ దుర్గ


మహానందిలో సింహవాహనంపై శ్రీ బ్రహ్మచారిణీ దుర్గ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శ్రీ బ్రహ్మచారిణీదుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, రుత్వికులు, అర్చకుల బృందం విశేషపూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని సింహవానంలో కొలువు చేసి ఆలయ ప్రాకారంలో ఉత్సవం కన్నులపండుగా చేశారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఉభయదాతలు, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

- నంద్యాల ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా
- అర్బన్ హెల్త్‌సెంటర్ ప్రారంభం


అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి తదితరులు

నంద్యాల టౌన్/ నంద్యాల సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేసి మెడికల్ కళాశాలలు, ఆసుపత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్స్, విలేజ్ క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. నంద్యాల పట్టణంలోని 38 వార్డు వైఎస్సార్ నగర్‌లో రూ.1.25కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలను ఇంటి ముంగిటకు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్షతో ఊరూరా వైద్యశిబిరాలు నిర్వహించడంతో పేదలు ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకుంటున్నారన్నారు. వైద్య సిబ్బంది పేదలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులను అందజేస్తున్నారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా రెఫరల్ ఆసుపత్రులకు పంపుతున్నారన్నారు. పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించడంతో వైఎస్సార్ నగర్, నందమూరి నగర్, బుడగ జంగాల కాలనీ, టిడ్కో గృహ సముదాయాల్లో నివసిస్తున్న ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్ తూర్పునాటి సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జ్ టీవీ రమణ మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి, రాష్ట్ర ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, జాకీర్ హుస్సేన్, సలాముల్లా, , రహంతుల్లా, పార్థుడు, దండే సుధాకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం.. స్వాతి మహోత్సవం


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో స్వాతి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం భక్తులు అహోబిలానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో నల్లమల పులకించి పోయింది. దిగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆండాల్ అమ్మవారి దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరణ చేసి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆ తర్వాత అర్చకుల వేద మంత్రోచ్చారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య శ్రీ స్వాతి, శ్రీసుదర్శన హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యాక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.

ధనలక్ష్మి అలంకారంలో..


ధనలక్ష్మి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు

బేతంచెర్ల: శరన్నవ రాత్రుల్లో భాగంగా వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో సోమవారం భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తిల ఆధ్వర్యంలో ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు, పాలక మండలి సభ్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, సుదర్శన ఆళ్వార్లను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

దళితులు ఐక్యంగా ఉండాలి

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్


మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్


హాజరైన కామవరం గ్రామస్తులు

కౌతాళం: దళితులంతా ఐక్యంగా ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కామవరం గ్రామంలో సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సవంలా సాగింది. గ్రామ సర్పంచ్ వసంత అధ్యక్షతన జరిగిన సమావేశంలో విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టాలను గురించి తెలుసుకోవాలన్నారు. నేటికీ చాలా గ్రామాల్లో అంటరానితనం కనిపిస్తున్నదని, ఈ మూఢాచారాన్ని రూపుమాపడానికి యువత నడుంబిగించాలన్నారు. రెండేళ్ల క్రితం కామవరంలో జరిగిన సంఘటన దురదృష్టకరమైనదన్నా రు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ప్రదీప్‌రెడ్డి, పార్టీ నాయకుడు మహేందర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, రాయలసీమ హక్కుల పోరాట సమితి నాయకుడు రాజు, మల్లె గ్రూపు అధినేత ఆల్‌ఫ్రెడ్ రాజు పాల్గొన్నారు.

అర్జీలు గడువులోగా పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: 'జగనన్నకు చెబుదాం – స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తదితర జిల్లాధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించక పోతే మళ్లీ రీఓపెన్ అయ్యే అవకాశముందన్నారు. జగనన్నకు చెబుదాం ఆడిట్‌లో ప్రజలు అసంతృప్తి చెందిన కేసులు, రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించి పరిశీలించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు హాజరైన పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మెడికల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణకు సూచించారు. ఫిర్యాదులు రాకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. మెడికల్ అధికారులు, స్పెషల్ అధికారుల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూసుకోవాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లోని మెడికల్ క్యాంపులకు ఐఎంఏ డాక్టర్ల సేవలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వినతుల్లో కొన్ని..

- తన భర్త వెంకటన్న పేరు మీద ప్రభుత్వం ఇచ్చిన ఐదెకరాల భూమిని పెద్ద కుమారుడు తనకు తెలియకుండా ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకం చేయించుకున్నాడని, చర్యలు తీసుకుని వెంటనే తన పేరుపై మార్చాలని మిడుతూరు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన గోపాలం సంజమ్మ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- రైతు భరోసా పథకం కింద డబ్బులు అకౌంట్‌లో పడడం లేదని, వివరాలను పరిశీలించి న్యాయం చేయాలని బండి ఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామానికి చెందిన శీలయ్య కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.
- నంద్యాల పట్టణంలోని వైఎస్ఆర్ నగర్ టైలర్స్ కాలనీ రహదారిని మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

బ్రహ్మచారిణిదేవిగా..


నందవరంలో బ్రహ్మచారిణిదేవి అలంకారంలో శ్రీ చౌడేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: దసరా శరన్నవరాత్రి అలంకారాల్లో భాగంగా నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి సోమవారం రెండవ రోజు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రామానుజన్ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి చండీపారాయణం, దుర్గ, రాత్రి, దేవి సూక్తి, రుద్రపారాయణం తదితర పూజలు నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో వెలసిన శ్రీవాసవీకన్యకాపరమేశ్వరిదేవి శ్రీబాలా త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పాణ్యం: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మండల కేంద్రమైన పాణ్యంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లెకు చెంది నల్లబోతుల సంజీవరాయుడు(25), పాణ్యం గ్రామానికి చెందిన నల్లబోతుల రాజు బైక్‌పై పాణ్యం బస్టాండ్ నుంచి రాంగ్ రూట్‌లో బయలుదేరారు. వెలుగోడుకు చెందిన షేక్ మదార్‌బీ, షేక్ షార్జహాన్, రహంతులా స్వగ్రామం నుంచి బైక్‌పై సిమెంట్ నగర్‌కు వెళ్తున్నారు. పాణ్యంలోని తిరుమలగిరి వద్దకు ఎదురెదురుగా వీరి బైక్‌లు ఢీకొన్నాయి. తలకు తీవ్రగాయమై నల్లబోతుల సంజీవరాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో శాంతిరాం, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రులకు 108, హైవే అంబులెన్స్‌లలో తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇంటిని ఆక్రమించాలని చూస్తున్నారు!

- స్పందనలో పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

కర్నూలు: తన ఇంటిని ఆక్రమించుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు మండలం బి.తాండ్రపాడు శివారులోని టీవీ9 ప్రజానగర్ కాలనీకి చెందిన వసంత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తపేట దగ్గర ఉన్న ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ యుగంధర్ బాబు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 86 ఫిర్యాదులు స్పందనకు వచ్చాయి. స్పందనకు వచ్చిన ఫిర్యాదులన్నిటిపై చట్టపరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- మద్యం తాగడానికి పెన్షన్ డబ్బులు ఇవ్వాలని కుమారుడు ప్రసాదరావు ప్రతిరోజూ వేధిస్తున్నాడని కల్లూరు మండలం శరీన్‌నగర్‌కు చెందిన జయమ్మ ఫిర్యాదు చేశారు.
- కుమారుడు జావిద్ పదేళ్లుగా ఇంటికి తాళం వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కర్నూలు నగరం మంగళ వీధిలో నివాసముంటున్న అబ్దుల్ నజీర్ కోరారు.
- ఆస్తి విషయంలో అన్న మల్లికార్జున ఇతర వ్యక్తులతో కలసి తనను, తన భార్యను కొట్టి తీవ్రంగా గాయపరిచారని తుగ్గలికి చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు.
- తల్లిదండ్రుల మాటలు విని భర్త హరిబాబు హింసకు గురిచేస్తున్నారని కర్నూలు లేబర్ కాలనీకి చెందిన సుమతి ఫిర్యాదు చేశారు.
- భర్త తనతో గొడవ పడి వేరొక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తాను లేని సమయంలో ఆరు సంవత్సరాల కుమారుడిని తీసుకువెళ్లి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కర్నూలు ప్రకాష్ నగర్‌కు చెందిన సావిత్రి ఫిర్యాదు చేశారు.

నేడు డిగ్రీ తక్షణ పరీక్ష

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం జరగనున్న డిగ్రీ తక్షణ పరీక్షకు 568 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వీసీ ఆనందరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. నంద్యాలలోని పీఎస్సీ అండ్ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కర్నూలులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలలో కేంద్రాలు ఏర్పాటు చేశామని వీసీ వెల్లడించారు.

ఫొటో ఆఫ్ ది డే

చేతినిండా సంప్రదాయం!

చేతులకు గాజులు వేసుకోవడం బరువుగా భావిస్తున్న రోజులివి. ఫ్యాషన్ మోజులో చాలా వరకు మహిళలు సంప్రదాయాన్ని గాలికొదిలేస్తున్నారు. పెద్దలకు భయపడి ఒక గాజు వేసుకోవడం.. ఒక్క చేయికే సరిపెట్టి వాచ్ పెట్టుకోవడం చూస్తున్నాం. కానీ ఇప్పటికీ చాలా మంది గాజులు కనిపిస్తే చేయి నిండుగా తొడిగించుకుంటారు. ఆ శబ్దంతో తమ సౌభాగ్యానికి మురిసిపోతుంటారు. భర్తకు చూపి మరీ ఆనందపడుతుంటారు. నగరంలోని వినాయకఘాట్ వద్ద సోమవారం మధ్యాహ్నం మండుటెండను సైతం లెక్క చేయకుండా ఓ మహిళ గాజులు తొడిగించుకుంటున్న తీరు, ఆ సమయంలో ఇద్దరూ చెప్పులను కూడా పక్కన పెట్టడం మన సాంప్రదాయ విలువలకు అద్దం పట్టింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

